అన్నదమ్ములు

శ్రీ తలిశెట్టి సభాపతిరావు

రాత్రి ప్రొద్దుపొయ్యేదాకా రావు మందిరంలో పేకాడి, పోయినంత పోగొట్టుకుని ఇంటికి చేరాడు పట్టాభి రామయ్య. అప్పటికే అన్న వెంకట్రామయ్య భోంచేసి కునుకు తీస్తున్నాడు. వదినెగారి జాడ కనపడనేలేదు. తన భార్య రత్నం మాత్రం దొడ్లో మంచంమీద వెల్లకిలా పండుకునివుంది.

పట్టాభి ఒక్క క్షణం నిశ్శబ్దంగావుండి, చిన్నపోడిదగ్గు దగ్గాడు. రత్నం చూసింది. తాను బట్టలు మార్చుకునేందుకు గదిలోకెళ్లాడు. రత్నం వచ్చి వంటయింట్లో ప్రవేశించింది. పట్టాభి బట్టలు మార్చుకుని, కాళ్ళూ చేతులూ కడుక్కుని తుడుచుకుంటూ వంటగదిలో ప్రవేశించి, వడ్డన చేసివున్న కంచానికెగబడ్డాడు. రత్నం మళ్ళీ బయటికొచ్చి నిలబడింది.

పట్టాభి కిదంతా కొత్తగానూ, ఏనాడూ లేని నిశ్శబ్దం ఆనాడు అలుముకున్నట్లు కన్పించింది. తన భార్య కూడా ఆ రోజు తనపట్ల అలా ప్రవర్తించటం, అతని కేదో సందేహాన్ని కలగజేసింది...మాట్లాడకుండా మారు కావల్సినా అడక్కుండానే భోజనం ముగించాడు. అసలీ మార్పుకు కారణం ఏమిటో తెలుసుకోవాలన్న కోరిక అతన్ని ఎంతో తొందరపెట్టింది.

పట్టాభి భోంచేసిం తర్వాత, తనూ రెండు మెతుకులు తిని, వంటిల్లు సర్ది, భర్త గదిలో కెళ్ళి మూలనున్న చాప పరచుకు పడుకోబోయింది రత్నం. భార్యకోసం ఆతృతతో ఎదురుచూస్తున్న పట్టాభి ఆశ్చర్యపడ్డాడు. తన భార్య కోపగించినప్పుడల్లా అవలంబించే పద్ధతే ఇది. గభ్భున లేచి వచ్చి "రత్నం!" అంటూ అమాంతంగా పట్టుకున్నాడు.

"వదలండి." ఆమె విదలించుకోబోయింది. పట్టాభి నీరయ్యాడు.

"రత్నం! ఇలా చూడు. ఎందుకూ ఈ కోపం" అంటూ బుజ్జగించబోయాడు.

"నా కోపతాపాలు ఎవర్నేం చేస్తయ్. బానిస బ్రతుకు బ్రతుకుతూన్న నే నెవరి మీద కోపగించగలను"

కాస్త అర్థమైంది పట్టాభికి. తప్పకుండా తన భార్యకీ, వదినెగారికీ ఏదో జగడమైందనుకున్నాడు. అయినా ఇద్దరూ సామాన్య విషయాలమీద కీచులాడుకోవడం అప్పుడప్పుడు వున్నదే. కాని రత్నం ఇంత మొండిగా ఎప్పుడూ ప్రవర్తించలేదు.

"రత్నం అసలు సంగతేమిటో చెప్పకుండా బాధపెడుతున్నావ్...చెప్పవే"

"ఆ!—అయినా నే నెన్నిసార్లు చెప్పలేదు. మీ రెన్నిసార్లు తీర్చలేదు. మీకే పౌరుషం ఉన్నవాళ్ళైయితే పరిస్థితు లెందుకిలా వుంటయ్."

"............"

"ఎప్పుడూ నా మాటంటేనే గిట్టదు కదా. ఆవిడవల్లే ఈ సంసారం బాగుపడ్డట్లు ఆవిడే యజమానురాలన్నట్లూ మాట్లాడుతుంది. తెల్లారి లేచింది మొదలు, పేక ఆడుతూనో, రిజాలాగా తిరుగుతూనో మీరుంటారట; ఇంట్లో వుండే పూస మెత్తు పనైనా చెయ్యకుండా, సీతాకోకచిలుకలా అలంకరించుకునే కూర్చుంటానట. సంపాదన లేకపోగా వున్నదాన్ని పాడుచేసుకోడంకూడా తెలీదట, మరి మీవల్లా నావల్లా ఏం ఆస్తులు పోయినయ్యో, ఎన్ని అగచాట్లు వచ్చినయ్యో ఇంతకీ కట్టుకున్నవాడు పౌరుషం లేనివాడైం తర్వాత ఎవరైనా పడక తప్పుతుందా?"

"............"

"ఆఖరికీనాడు అనుకున్నంత మాటా అన్నదావిడ. దిక్కూ మొక్కూ లేకుండా, కూటికీ గుడ్డకీ ఈ పంచ చేరినట్లు మాట్లాడింది...అంత ఇష్టంలేకపోతే వేరే వుండమంది" అంటూ ఒక వర్షాన్ని కురిపించింది రత్నం. అంతవరకూ బిగబట్టుకు వస్తూన్న దుఃఖం ఒక్కసారి పైకుబికింది.

పట్టాభి చాలసార్లు విన్నాడిదంతా. తనకు తెలుసు వదినె తన భార్యను మందలించడం. అయినా ఇంటి పెద్ద అన్నగారుండగా తన కెందుకన్నట్లు వూరుకున్నాడు. బహుశా వదినె ఈవిషయం గుర్తించక లోకువ చేసిందేమో...అదీకాక ఆవిడ ఎన్నడూ ఇంత కఠినంగా మాట్లాడలేదే. ఈనాటికి ఈ మాటలు ఎట్లా అందో. పోనీ అన్నగారైనా తనతో ఎన్నడూ అన్లేదే. బహుశా అన్నయ్యే వదినతో అనిపించాడేమో!

రత్నం మళ్ళీ మొదలెట్టింది. "ఏం? ఆవిడమాత్రం ఈ యింటి కోడలు కాదూ?

ఆమె కెంత హక్కుందో, ఈ ఇంట్లో నాకూ అంతే వుంది. అయితే ఆ ముద్దు ఆయన చెల్లిస్తున్నాడు. మా ఆయన చేత కాని వాడయ్యాడు. అంతే!"

పట్టాభికి బుర్ర వేడెక్కింది. ముఖం తీవ్రరూపం దాల్చింది. మనసులో అనుకున్నాడు. "నిజమే! తన భార్య, వదినే ఇద్దరూ ఆయింటి కోడళ్ళే. ఇద్దరూ సమాన హక్కు కలవాళ్ళే... పెద్దదైనంత మాత్రాన వదిన, తన్నూ తన భార్యని గౌరవించక పోవడం బిరుసుతనం కాదూ...ఎన్నాళ్ళిలా తగవులాడుకోడం. తనకు రావాల్సిందేదో తేల్చేసుకుని వేరే వుండటం ఉత్తమం" అనుకున్నాడు. తెల్లవార్లూ ఈ సంగతే తీవ్రంగా ఆలోచించాడు. మధ్యమధ్య భార్య చెప్పిన మాటలు మంత్రాల్లా పనిచేసి, పట్టాభి నిశ్చయాన్ని మరింత బలపరిచినయ్.

మరుచటిదినం. వీధిలోకి వెళ్ళబోతూన్న వెంకట్రామయ్యని, పట్టాభిరామయ్య నీతో మాట్లాడాలంటూ ఆపాడు. మెట్లు దిగుతున్న వాడల్లా ఆగి, ఆశ్చర్యంగా చూశాడు తమ్ముడివంక...ఇద్దరూ చావిడిలో కొచ్చారు.

"నిన్న జరిగిన విషయం తెలుసుగా" అన్నాడు పట్టాభి.

"ఆ!...ఆ విషయంలో మనం మాట్లాడే దేముంది?"

"అదే! అవి డన్నమాట—మీ కంత కష్టంగా వుంటే నే వేరే కాపురం వుంటాను." అన్నాడు తడుముకోకుండా.

వెంకట్రామయ్య నిర్ఘాంత పోయాడు. ఒక్కసారి చిరుచెమటలు పట్టినయ్. తనతో మాట్లాడుతూన్నది తన తమ్ముడేనా అని, తాను వింటూన్నది అత నన్నమాట లేనా అని తికమకపడ్డాడు—ఇంతలో ఏదో పనిమీద అలా వచ్చిన వెంకట్రామయ్య భార్య, ఆ ఘట్టాన్ని చూసి అలాగే గడపలో వుండిపోయింది. వెంకట్రామయ్య కొంచం తమాయించుకుని ఇలా అన్నాడు.

"పట్టాభీ! నువ్వే మంటున్నావో నీకు తెలుసా?"

ఒక్కసారి తీవ్రంగా చూశాడు అన్నయ్యవంక—వదిన్ని చూడగానే, అతనిలో అప్పటికే తీవ్రరూపం దాల్చి వున్న కోపం, ద్విగుణీకృతమయింది. మళ్లీ అన్నాడు "నే వేరే వుంటాను అని అన్నా"—

ఈమాట విన్న వెంకట్రామయ్య భార్య కూడా గతుక్కుమంది. వెంకట్రామయ్య అదోలా చూశాడు తమ్ముడివంక.

పట్టాభిరామయ్య మళ్ళీ అందుకున్నాడు. "ఇద్దరికీ సమాన హక్కులున్న ఈ యింట్లో నాకు గౌరవం లేదని. వయస్సుకు చిన్నవాడినైనంత మాత్రాన గౌరవహీనుడినా?" వెంకట్రామయ్య చిన్నగా నవ్వాడు. "ఓస్! ఇదా సంగతి. ఈమాత్రానికే వేరెవెళ్లిపోవాలా? ఈక్షణం నుంచీ నువ్వు నీభార్యే పెత్తనం వహించండి. మేము కోరేదీ అదే. బాధ్యతవహించమనే మీ వదినకూడా అంది. ఏదో పూర్వీకులు, తినో తినకో ఇంత ఆస్థిపాస్తుల్ని సంపాదించారు. వాటిని పొదుపు చేసుకోవడం మనవిధి. మంచికి చెపితే అపార్థం చేసుకుని అలా తొందరపడతావేం?" అన్నాడు. ఈపరిణామానికి కారణం తన

HVM. 167-50 TL

మరదలేనన్న సంగతి గ్రహించక పోలేదు వెంకట్రామయ్య.

"నేనుమాత్రం ఏం చెడ్డ అన్నాను. అస్తమానం పేకాటలో కూర్చుంటే ఎట్లా; కాస్త ఆపనీ ఈపనీ చేస్తువుండాలి. మీ అన్నయ్య ఒక్కరు ఎంతని తంటాలు పడతారు అన్నా. ఆమాత్రానికే వేరే వుండాలా నాయనా! అయినా యజమానులైన అన్నదమ్ముల్ని విడిపొమ్మనడానికి నే నెవర్ని" అంటూ సమర్ధించబోయింది వెంకట్రామయ్య భార్య కాంతమ్మ.

"నువ్వూరుకోవే!" అంటూ, తమ్ముడివంక తిరిగి "సరే లేవోయ్ ఆలోచిద్దాం" అంటూ లేచాడు వెంకట్రామయ్య.

"ఆలోచ నేముంది. ఒకటి రెండు రోజుల్లో అంతా జరిగి తీరాల్సిందే" అంటూ విసురుగా తనగదిలోకి వెళ్ళిపోయాడు పట్టాభిరామయ్య. బరువుగా నిట్టూరుస్తూ, మెట్లుదిగాడు వెంకట్రామయ్య.

ఈసంఘటన జరిగి పూర్తిగా రోజైనా కాలేదు వూరంతా అట్టుడికి నట్టుడికింది. అంతా విస్తుబోయారు. వెంకట్రామయ్య కుటుంబ గౌరవాన్ని, తాహాతునీ ఎన్నాళ్లనుంచో ఎరిగున్న వారంతా, కారణం ఏమిటంటూ ప్రశ్నించారు. పాపం!

వెంకట్రామయ్య ఏమని చెప్తాడు? తనూ, పట్టాభీ ఏక గర్భజనితులు. ఎంతో కట్టుబాట్లతో పెరిగి గుట్టుగా సంసారాన్ని సాగిస్తున్నారు. ఈనాడు ఇద్దరూ వేరవుతున్నారంటే ఏంకారణం చెప్పడం?

వెంకట్రామయ్యకు తెలుసు తన తమ్ముడివద్ద నిలకడ లేదని. తనకు తెలీకుండా ఎంతడబ్బుతగలెయ్యలేదు. పేకాట మాన్పించేందుకు తనెంత ప్రయత్నించలేదు. ఓర్పుతో నేర్పుగా తన తమ్ముడిని త్రిప్పచూశాడు. లాభం లేకపోయింది. బ్రతిమిలాడాడు. చేతులుపట్టుకుని వంశగౌరవం కోసం, తనకా వూళ్ళోవున్న ప్రతిష్టకోసం, ఈపట్టుదల వదలమన్నాడు — చివరికి భార్యమాటవిని, పచ్చని సంసారాన్ని, పాడిపంటలతో వర్ధిల్లుతోన్న ఇంటినీ విభాగంచెయ్యడం అధర్మమని వాదించాడు. గత్యంతరం లేకపోయింది. చివరికి వూళ్ళోవున్న నలుగురి పెద్దల్తో చెప్పించి చూశాడు. పట్టినపట్టు మరింత బిగిసిందేకాని, ఏమాత్రం సడల్లేదు. తుదకు కన్నీళ్లతో వెంకట్రామయ్య, పౌరుషంతో పట్టాభిరామయ్య వేరయ్యారు. ఆస్థిపాస్తుల్ని ఇద్దరూ సరిసమానంగా పంచుకున్నారు. పట్టాభిరామయ్య అవతలివీధిలో తన భాగానికి వచ్చిన ఇంట్లోకి, భార్యాసమేతంగా వెళ్లిపోయాడు. వున్న ఇంట్లోనే వెంకట్రామయ్య, అతని భార్య కాంతమ్మా విచారభారంతో కుంగిపోయారు. బొడ్డున తాళాలు పెట్టుకుని అధికారం చలాయించాలనుకున్న రత్నంకోరిక తీరింది.

ఆనాటినుండీ అన్నదమ్ములిద్దరూ కలుసుకోలేదు. పట్టాభిరామయ్య కీ సంగతి గుర్తేలేదు. ఈ అన్నా, తమ్ముడూ ఒకే రక్తాన్ని పంచుకుని జన్మించినా, ఇద్దరి మనస్తత్వానికీ చాలా భేదంవుంది. వెంకట్రామయ్యది శాంత స్వభావం, నెమ్మదిగల మనిషి. పట్టాభి దూరాలోచన లేనివాడు. దురుసువాడు. పాతికేళ్ళకు పైగావున్నా అతనికి శ్రద్ధఅనేదేలేదు. ఏదో వేళకింటికొస్తూ వుండడం, వడ్డించింది తింటూ పోతూ వుండడం, పేకాటతో కాలం వెళ్ళబుచ్చడం అలవాటైంది. తమలో ఎన్నడూ, ఎవరికీ అలవాటుకానిది పట్టాభికి అలవడ్డం వెంకట్రామయ్యకు ఎంతో దుఃఖకారణమైంది. స్వతంత్రుడుగా లేనంతవరకూ ఎలాగో గడిచింది. ఇక ఇప్పుడు తమ్ముడిలో ఎలాంటి మార్పు వస్తుందోనని భయపడ్డాడు. లోకం తన్నాడిపోస్తుందేమోనని బాధపడేవాడు.

రోజులూ, నెలలూ, సంవత్సరాలూ గడిచినయ్. ఆదిలో తాను భయపడ్డట్టుగానే రానురాను పట్టాభినిగురించి తాను వింటున్నవార్తలు భయకంపితుడ్ని చేసినయ్. అల్లరిచిల్లరగా తిరుగుతున్నాడనీ, వున్నదంతా జూదంలో తరుగుతోందనీ వాళ్లువీళ్లూ చెప్తుంటే విని విచారించేవాడు. కాంతమ్మకూడా ఇరుగుపొరుగు చెప్పిన మాటలువిని బాధపడేది. పోయినసారి కరణంగారింట్లో శుభకార్యం రోజున తన తోడికోడల్ని చూసి ఆశ్చర్యపడింది. ఆమెలో అనుకోని మార్పు వచ్చింది. అందంగా, బొద్దుగా ఎప్పుడూ శీతాకోక చిలుకలా అలంకరించుకునివుండే రత్నం, లోతుకుపోయిన కళ్ళతో చిక్కి సగమైంది. ఆనాటి డాబూ, దర్పమూ మాయమైనయ్. సామాన్యంగా తయారైరావడం కాంతమ్మ కంటో తలకొట్టినట్లయింది. కారణం తనే వూహించుకోలేకపోయింది.

ఇంటికొచ్చి భర్తతో చెప్పింది. వెంకట్రామయ్య నిట్టూర్పు విడుస్తూ అన్నాడు. "అదీ మనలాగే బాధపడుతోంది. వాడికి అహర్నిశలూ జూదంతోనే సరిపోతూంది. ఇల్లూ, సంసారమూ, పెళ్లామూ అని వాడికేమన్నా దండమోస్తేనా. వున్న ఆస్తంతా తగలేస్తున్నాడు. చివరికి ఆ మిగిలిన నాలుగెకరాలు మొన్న దసరా వెళ్లింతరవాత మార్వాడీకి తనకా రాశాట్ట."

"ఆ!...అంతవరకూ వచ్చిందా?" అంటూ కాంతమ్మ గుమ్మానికి చేరబడిపోయింది.

"మీరయినా కలిసి మాట్లాడలేకపోయారా. ఎంత వేరున్నా తమ్ముడేగా. అతడలా పాడవడం మీకుమాత్రం అగౌరవం కాదూ?"

"పిచ్చిదానా! చూస్తూ వూరుకున్నానంటావా. చెయ్యవలసిన ప్రయత్నాలు



ఒక గంటలో యౌవ్వనము

కామ స్తంభన

ధాతుపుష్టి, సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది. విరాళచెందిన వృద్ధులయందు శక్తి, ఉత్సాహము నిచ్చును. రు. 2-8-0

మదన మంజరి ఫార్మసీ

184, చైనా బజారురోడ్డు, మద్రాసు.
బెజవాడ—శ్రీనివాస మెడికల్ స్టోర్సు పార్కు రోడ్డు. రాజమండ్రి—ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడ్డు. వెల్లూరు: ఆర్యన్ ఫార్మసీ.

చేశాను. చెప్పించవలసినవాళ్ళచేత చెప్పించాను. వాడు వింటేనా?—ఇంతకీ శనిదినాలు వాడి నెత్తిన తాండవ మాడుతున్నయ్. ఎలా జరుగుతుందో." అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు వెంకట్రామయ్య.

పట్టాభిరామయ్య వేరింట కాపురం వచ్చిందగ్గరనుండీ సర్వస్వతంత్రుడి ననుకున్నాడు. తన ఇష్టం వచ్చినట్లు తిరగడం మొదలెట్టాడు. రత్నం మొదట్లో భర్తను ఏమీ అనలేకపోయినా, రానురాను భర్తలో వస్తూన్న మార్పునుగురించి భయపడింది. మెల్లిగా మంచిమాటల్తో చెప్పింది. బ్రతిమాల్తూ ఏడ్చింది. అతని ప్రవర్తన ఫలితంగా ఇంట్లో ఏర్పడుతూన్న లోటును గుర్తించమంది. వున్న ఆస్తంతా ఇలా తగలవేస్తే ముందు బ్రతుకుదెరువు ఎలాగో ఆలోచించమన్నది.

కాని—దుర్వ్యసనాలకు పూర్తిగా లొంగిపోయిన పట్టాభికి ఈమాటలేం రుచించలా. ఏ మాటల్తో తన భర్తను మంత్రబగునిలా చెయ్యగలిగిందో, ఆ మాటలు నేడు ఎందుకూ పనికిరాకుండాపోయినయ్. వున్న బంగారం చిల్లరామల్లరా బజారున బడినయ్. పాపం! బోసిగావున్న తన మెడను చూసి ఎన్నోసార్లు ఏడ్చింది. తన భర్త ఎందుకిలా నాశనమవుతున్నాడో ఊహించుకోలేకపోయింది....తొందరపడి పెద్దఇంట్లోంచి రావడమేమోనని అనుకునేది.

మరో మూడుకాలండర్లు మారినయ్. ఈ లోపల దేశంలోనూ, ముఖ్యంగా ఆ గ్రామంలోనూ అనుకోని మార్పులు వచ్చినయ్. నిర్ణీత సమయానికి వర్షప్రాప్తి లేక పంటలు లేక చిన్నచిన్న రైతులంతా చేతులెత్తారు. అలాంటివారిలో పట్టాభి ఒకడు. ఇంతేకాక భూమి తనఖా పట్టిన మార్వాడీ; పెట్టిన గడువుఅయినా, అసలు ఇవ్వలేదు సరికదా వడ్డీయైనా కట్టలేదని కోర్టులో దావాపడేశాడు. ఒక్కసారిగా చుట్టుముట్టిన కష్టాలన్నీ పట్టాభిని పిచ్చివాడిని చేసినయ్. మనశ్శాంతి లేకుండా బాధపడ్డాడు. రానురాను జరుగుబాటే కష్టమైంది. దాంతో బయటికి రావడం మానుకున్నాడు—ఎలా చూస్తాడు ప్రజల ముఖం ఈ పరిస్థితుల్లో? ఆనాడు తన మంచిని కోరి చెప్పిన పెద్దలంతా ఈనాడు తన్ను చూసి నవ్వరూ! ఆనాడు వదినె, అన్నయ్య అన్నారంటే అందులోని విశాలభావాన్ని గుర్తించలేకపోయాడు. తన భార్యేగా తన్ను ప్రోత్సహించి, తరుముత. తనెంత తొందరపడ్డాడు. తన నాశనానికి కారణం తన భార్యేనని, ఆమెమీద మండిపడేవాడు. తత్ఫలితంగా ఆ దంపతుల్లో కలతలేర్పడినయ్—

ఆనాటిరాత్రి భోంచేసి భార్యతో పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ కూర్చున్న వెంకట్రామయ్యకు, కరణంవచ్చి చెప్పిన కబురు కంగారుపెట్టింది. క్రుంగిపోయాడు పాపం!

"ఈ సమయంలో విచారిస్తూ కూర్చుంటే ఎలా? ముందు కర్తవ్యాన్ని ఆలోచించండి వెంకట్రామయ్యగారూ?"

"ఏమాలోచించడం కరణంగారూ! మా కుటుంబంలో ఇలాంటి విప్లవం వస్తుందని కలలోకూడా అనుకోలేదు. పచ్చగా లక్ష్మీదేవితో కలకలాడే మా యిల్లు రెండుముక్కలయింది. వాడి నెత్తినేదో శనిదేవత కూర్చోకపోతే వాడింతటి తెగింపుకు ఎన్నడూ సిద్ధంకాడు."

"సరే అవన్నీ మాకు తెలీని విషయాలా అవి అలా వుంచండి. ఇప్పుడు మీవాడిని ఈ ఆపదనుండి నెట్టుకొచ్చే దెట్లా?"

"నేనేం చెయ్యను. ఇంత అకస్మాత్తుగా వచ్చిన ఆపదను, వాడి స్థితిని తలచుకొని విచారించడం కంటే."

కరణం ఆశ్చర్యపోయాడు. "వెంకట్రామయ్యగారూ! చిత్రంగా వుంది మీ ధోరణి. ఎంత చెడ్డా మీ తమ్ముడేనా. గౌరవప్రతిష్ఠలుకల మీలాంటి వారి కుటుంబంలో ఒక ప్రాణి ఇలా పేరు ప్రతిష్ఠలు లేకుండాపోవాల్సిందేనా. తప్పదు. మీరు కలుగజేసుకోవాలి. తెల్లారేటప్పటికి వస్తా. శలవ్" అంటూ సమాధానంకోసం ఎదురుచూడకుండా వెళ్లిపోయాడు

నడవలో కూర్చుని ఈసంభాషణంతా విన్న కాంతమ్మ "ఏమిటండీ అసలు విషయం?" అంది.

"ఏముంది. తెల్లార్తే మార్వాడీ వాడ్నినడి బజార్లో అమ్మతాడు." అన్నాడు. గతుక్కుమంది కాంతమ్మ, కన్నీళ్ల పర్యంతం అయింది.— "ఇంతవరకూ వస్తే, నాకేం సమ్మంధంలేనట్లు మాట్లాడతారేం. పైవాడికున్నంత అభిమానమైనా మీకు లేకపోయిందా. తినడానికి మనింట్లో పిల్లా జల్లా? వాళ్లిద్దరికంటే మనకి ఆప్తులెవరూ? మర్యాదపోయిం తర్వాత డబ్బుండీ ఏం లాభం? ఏం విలువ? పట్టాభి అల్లరిపడి వీధిపాలు కాడం మీకే కాదా?" అంది—

కాంతమ్మ వంక పిచ్చిగా చూశాడు వెంకట్రామయ్య. ఆమెహృదయం ఎంత ప్రేమమయం. అర్థం చేసుకోలేకపోయింది. కాని తన మరదలు. అనుకున్నాడు—

తెల్లారేటప్పటికి ఈవార్త ఊరంతా ప్రాకింది. వెంకట్రామయ్యా, కరణమూ కలిసి వెళ్లారు పట్టాభిరామయ్య ఇంటికి. ఆ మార్వాడీ అప్పటికప్పుడే వచ్చి కూర్చున్నాడు కోర్టువాళ్లతో. కరణం ద్వారా లెఖ్ఖలన్నీ సరిచూపించి, అయిన మొత్తం అయిదువేల చిల్లర వాడిముఖాన కొట్టి దయచేయమన్నారు.

సిగ్గుతోనూ, దుఃఖంతోనూ చచ్చివున్న పట్టాభిరామయ్యకు తొంగిచూడ్డానికైనా ధైర్యం లేకపోయింది. అతని అవస్థచూచి వెంకట్రామయ్య హృదయం ద్రవీభూతమైంది. "పట్టాభీ!" అంటూ చేతులు చాచాడు.

"అన్నయ్యా!" అంటూ కాళ్ళమీద పడ్డాడు పట్టాభి. మళ్లా ఇన్నాళ్లకి ఆ అన్నదమ్ము లిద్దరూ ఒకరి హృదయాని కొకర్ని హత్తుకున్నారు.

నాటితోనే ఆ అన్నదమ్ములూ, ఆ తోడికోడళ్ళూ ఏకమయ్యారు. పట్టాభిరామయ్య, రత్నం; కాంతమ్మ కాళ్ళమీద పడి కన్నీళ్లు కార్చారు. ఆనాటినుండి ఆ దంపతు లిద్దరూ దైవసమానులు.

"ఎంతైనా వాళ్ళిద్దరూ అన్నదమ్ములేగా. రక్తసంబంధం ఎక్కడకుపోతుంది" అన్నారా వూరి ప్రజ— ★

రు 1000 బహుమానం
లెప్రర్ క్యూర్
(రిజిష్టర్డు)
కుష్టు, బొల్లి, సుఖరోగాదులకు
గ్యారంటీ చికిత్స.
అన్ని భాషలలోను కేటలాగు ఉచితం.
లక్ష్మి అండ్ కో
(రిజిష్టర్డు)
H. O. వాల్తేరు, ఆర్. యస్.
బ్రాంచీలు:
2/135 బ్రాడ్వే, మదరాసు.
గాంధినగర్, విజయవాడ.
కటక్, సికింద్రాబాదు,
రాజమండ్రి etc.